
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## ఆంధ్ర ఫిలిం పరిశ్రమ - సమస్యలు

## శ్రీ కాట్రగడ్డ నరసయ్య

### ( 1955 ఏప్రిల్ కినిమా పత్రిక నుంచీ పునర్ముద్రణ)

**ఆంధ్ర ఫిలిం** పరిశ్రమ ప్రతి సంవత్సరం అభివృద్ధి అవుతూ వుంది. 1953 కన్నా 1954లో విడుదలైన చిత్రాల సంఖ్య ఎక్కువ. ఆదాయం సంఖ్యలు మాత్రం తగ్గుముఖం చూపుతున్నాయి. 1952/53 వినోదపు పన్ను సుమారు 37 లక్షలు వస్తే 1953/54లలో 32 లక్షలు మాత్రమే వచ్చింది. దీనినిబట్టి పరిశ్రమకు 1953కన్న 1954లో లాభాలు తగ్గినాయని గుర్తించవచ్చును.

కనుక పరిశ్రమ స్వయంపోషకం కావాలంటే ఆదాయం పెంపొందించే మార్గాలను పరిశోధించాలి. మామూలుగా వచ్చే ఆదాయంకంటే అదనపు ఆదాయాన్ని పొందే మార్గాలు పరిశోధించాలి. ఛేంబరు యీ విషయాల్ని గురించి తీవ్రంగా కృషిచేయాలి.

*<u>లైసెన్సుల సమస్యలు</u>*

రోజురోజుకీ టూరింగుల సంఖ్య దిగజారిపోతూంది. దీనికి ముఖ్య కారణమైన సినిమాటోగ్రాపు రూల్సులోని లోట్లను ఒక సమగ్రమైన రిపోర్టు రూపంలో చేంబరు ప్రకటించి ఆ మార్పుల కొరకు తీవ్రమైన కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇలాంటి పరిశీలన లేకపోవటంతో ప్రభుత్వంతో వ్యక్తిగత సమస్యలకొరకు రాయబారాలు జరపటం జరుగుతూంది. దీనిని శ్రమ దృష్ట్యా పరిశీలించితే ఫలితం కృషికంటె చాలా తక్కువగా అగుపడుతుంది. కనుక పరిశ్రమ

అవసరాలను ముఖ్యంగా ప్రదర్శన శాఖలో ప్రభుత్వం ముందు పెట్టాలి. పరిశ్రమకు కేంద్రముల సంఖ్య ఆదాయాన్ని నిర్ణయించుతుంది.

కనుక టూరింగు సంఖ్య పెంపొదించటానికి సినిమాటోగ్రాఫు చట్టంలో అవసరమయ్యే మార్పులను ప్రభుత్వానికి చూపాలి. ఉదాహరణకు ఫిలిం ఎంక్వయిరీ కమిటీ రిపోర్టులో సూచించిన బహిరంగ సినిమా ప్రదర్శనశాలలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. కాని రాష్ట్రప్రభుత్వం దీని విషయంలో ఏమీ శ్రద్ధ వహించలేదు. పైగా టూరింగులు అగ్నిప్రమాద దృష్ట్యా తాటాకుతో కప్పరాదని, టెంటు మాత్రమే వేయాలని ప్రకటించింది. దీనివలన మూలిగే నక్కపైన తాటికాయపడ్డట్లు టూరింగులు ఇంకా తగ్గటానికి దోహదం అవుతుంది. కనుక చేంబరు వెంటనే బహిరంగ సినిమా ప్రదర్శనశాలలకు లైసెన్సులు యిచ్చే ఏర్పాట్లకు ఆందోళన లేవదీయాలి. అప్పుడు టూరింగులు పెరగటానికి వీలవుతుంది. గ్రామంలో వుంటే గల్లంతుగా ఉంటుంది కనుక ఊరుబయట ఒక మైలు దూరంగా బహిరంగ ప్రదర్శన శాలల నిర్మాణానికి ప్రభుత్వం వీలు కలగజేయాలి. టూరింగుల సంఖ్య పెరగటం ప్రభుత్వానికి కూడా లాభం. వీనిని నిర్మించటానికి ప్రోత్సహించాలి.

లైసెన్సులుకంటే లైసెన్సులు ఇచ్చే పద్ధతిని మార్చాలి. ఉదాహరణగా గేట్ల విషయంలో స్ట్రక్చరల్ ఇంజనీర్ చూస్తాడు. ఫైరు ఆఫీసరు చూస్తాడు. హెల్తు ఆఫీసరు చూస్తాడు. తమపైన బాధ్యత లేకుండా చేసుకోవడానికి ఆఫీసరు రిమార్కు వ్రాస్తాడు, ప్రదర్శకుడు రెక్టిఫికేషను చేశానని (సరిచేశానని) వ్రాస్తాడు. ఇలాంటి పద్ధతి వీలున్నంతవరకు పోగొట్టాలి.

***ఆంధ్రేతర ప్రాంతాలలోని ఆంధ్ర కేంద్రాలు***

ఆంధ్ర దేశంలోనుండి భారతదేశంలోని వివిధ పారిశ్రామిక కేంద్రాలకు చాలామంది ఆంధ్రులు వలసపోయారు. ముఖ్యంగా ఒరిస్సా, బెంగాలు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, బొంబాయి రాష్ట్రాలలో చాలా చోట్ల నివాసం ఏర్పరచుకున్నారు ఆ కేంద్రాలలో ముఖ్య కేంద్రాలు కాకుండా మ్యాటినీలుగా (ఆదివారం, శనివారాలలో ఉదయం మధ్యాహ్నం ఆటలుగా) ఆడే కేంద్రాలు చాలా వున్నాయి. అలాంటి కేంద్రాలలో ప్రదర్శనకు సరియైన ఏర్పాట్లు ఏమీ లేవు. కొంతమంది వ్యక్తుల చేతులలో ప్రదర్శన ఏర్పాట్లు ఉండటంచేత ప్రింటు ఖరీదు దృష్ట్యా, సెక్యూరిటీ లేనందునను ఆదాయం తక్కువన్న ఉపేక్షతో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు ఉపేక్షించుచున్నాను.

కనుక చేంబరు యీ కేంద్రాలలోని ప్రదర్శకులతో సరాసరి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి యీ కేంద్రాలలో ఒక క్రమ పద్ధతిని చిత్రాలను విడుదల చేస్తే చాలా ఉపయోగముంటుంది. దీనివలన ఆంధ్రేతర ప్రాంతాలలోని ఆంధ్రులకు, చిత్రాలను చూపామన్న ఆదర్శం వుంటుంది. పరిశ్రమకు అదనపు ఆదాయం వస్తుంది.

### *ప్రయివేటు ప్రదర్శనలు*

హిందీ పరిశ్రమకు 16. మి.మీ. ద్వారా సుమారు ప్రతి చిత్రానికి 15వేలనుండి 20 వేలవరకు అదనపు ఆదాయం ప్రయివేటు ప్రదర్శనలద్వారా వస్తుంది.

మన చిత్రాలకు 16.మి.మీ ప్రింటులు లేనందున యీ అదనపు ఆదాయంకూడా లేదు. కనుక 16.మి.మీప్రింటు తయారుచేసే ఆప్టికల్ రెడ్యూసింగు ప్రింటర్‌ని ఆంధ్రుల సంస్థలలో ఏర్పాటు చేయాలి.

### *విషయ సేకరణ*

చేంబరు ఇతర చేంబర్ల కార్యకలాపాలను గురించిన వివరాలు సేకరించాలి. అలా చేసినపుడు ఇతర భాషా రాష్ట్రాల పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు వారెలా పరిష్కరించింది గమనించి వీలున్నచోట అవలంబించవచ్చును. ఉదాహరణకు బీహారు బెంగాలులోని అస్సంసోలునుండి దామోదర లోయలోని వివిధ పారిశ్రామిక కేంద్రాలలోను సంచారపు సినిమా కేంద్రాలున్నవని తెలుస్తోంది. అచ్చట వున్న కార్మికుల వినోదం కొరకు ప్రతివారంలో ఒకరోజు ప్రతి కేంద్రానికి సినిమా ప్రదర్శన ఏర్పాటు చేయబడుతుంది. వాను పైన నిర్మించబడిన సంచారపు కేంద్రాలు తప్పకుండా తిరిగి వారానికి ఒకసారిగాని, 15రోజులకు ఒకసారిగాని అదే స్థలములో ప్రదర్శన యిచ్చి కార్మికులకు 0–2–0లతో వినోదాన్ని కలుగజేస్తున్నారని తెలుస్తున్నది. అలాంటి ఏర్పాట్లు 17,215 గ్రామాలున్న మన ఆంధ్రలో ఎంతైనా అవసరం.

వ్యాపారరీత్యా ప్రేక్షకుని దగ్గరకు ప్రదర్శనశాలను తీసుకొనిపోవటం ఎంతో ఆదర్శమైనది. లాభసాటియైన కార్యంగా గుర్తించాలి.

ఈ పద్ధతిని గురించిన వివరాలు సేకరించి చేంబరు మన ప్రభుత్వంతో రాయబారాలు సాగించాలి.

చేంబరు ఒక లైబ్రరీ తయారు చేయాలి. అంతర్జాతీయ చలనచిత్ర పరిశ్రమలలో జరిగే మార్పులను, నిర్మాణం, ప్రదర్శనలలోని సౌలభ్యాలను గురించి వివరాలు సేకరించాలి.

### *ఇతర రాష్ట్రాల మార్కెట్టు*

ఈనాడు మన చిత్రాలైన సంసారం, మల్లీశ్వరి, ఇతర రాష్ట్రాలలో కూడా పొగడబడ్డాయి. అలాంటి విజయవంతముగా నడచిన చిత్రాలను హిందీ టైటిల్సుతో చూసి ఇతర రాష్ట్రాలలో కొంత ఆదాయాన్ని సంపాదించవచ్చును. కనుక నిర్మాతలు ఆదాయాన్ని పెంపొదించటానికి చేంబరు ఇలాంటి కార్యక్రమాలు తీసుకుని ప్రయత్నించాలి.

### *అంతర్జాతీయ మార్కెట్టు*

ఈనాడు హిందీ నిర్మాతలు. అంతర్జాతీయ మార్కెట్టు సంపాదించుకోగలిగారు. సంవిధానంలోను, నిర్మాణంలోను బాగా పొగడబడిన హిందీ చిత్రాలతో సరితూగగల తెలుగు చిత్రాలు వచ్చాయి. వీనికి అంతర్జాతీయంగా మార్కెట్టు

రావాలంటే చాలా కృషి చేయాలి. ఒకసారి మార్కెట్టులో ప్రవేశించితే కొంతకానికి వ్యాపారం ఒక గాడిలో పడుతుంది. ప్రచారం కొనసాగించాలి. అందువలన ఆదరణ పొందిన చిత్రాలకు 16.మి. మీ ప్రింటు వేసి ఇంగ్లీషు టైటిల్సుతో కలిపి అంతర్జాతీయ సంస్థలకు చూపితే కొంత ఫలితం ఉంటుంది. ఇది కొంత అదనపు ఆదాయాన్ని కలగజేస్తుంది. అంతేకాకుండా అలా తయారయిన చిత్రాలను బార్టరు పద్ధతిలో మార్పిడి చేసుకుంటే కొంత వ్యాపారం సాగుతుంది. ఫిలిం ఫెడరేషన్‌వారు భారత దేశపు చిత్రాలకు అంతర్జాతీయ మార్కెట్టు కలుగజేయటంలో కృషిచేస్తున్నారు. ఆంధ్ర వ్యాపారస్తులుకూడా ఫిలిం ఫెడరేషను ద్వారాను, లేక ఇతర మార్గాల ద్వారాను కృషి చేయటం చాలా అవసరం.

***స్టేజిని పోషించాల్సిన అవశ్యకత***

చలనచిత్ర పరిశ్రమకు స్టేజిని పోషించాల్సిన ఆవశ్యకత చాలా వుంది.

ఈనాడు పేరుపొందిన నటీనటులందరు స్టేజ్ నుండి వచ్చినవారే. పరిశ్రమ తొలిరోజులలో స్టేజిమీద సినిమా పరిశ్రమ పూర్తిగా ఆధారపడింది కనుకనే నటీనటుల వేతనాల రూపంలోను సంవిధానాల దృష్ట్యాకూడా స్టేజి డ్రామాలను యధాతధంగా అనుసరించటంవలన ఖర్చులు చాలా తగ్గేవి.

టెక్నిక్ ఈనాడు పెరిగినందువలనను, ప్రేక్షకుల అభిరుచులు పూర్వంలాగా కాకుండా బాగా మారాయి కనుకను. స్టేజి డ్రామాలను యధాతధంగా అనుసరించితే లాభం లేదని, సినిమాలకు కథను తయారుచేసుకోవాలని నిర్మాతలు భావించవచ్చు.

ఈ సందర్భంలో హాలివుడ్, రష్యా, జపాను దేశాల చలనచిత్ర నిర్మాణాన్ని పరిశీలించితే స్టేజిమీద నిర్మాతలు ఎంత ఎక్కువగా ఆధారపడేది గమనించవచ్చు. హాలీవుడ్ తయారు చేసిన సంగీత చిత్రాలు, ఉత్తమ సాహిత్యంపై ఆధారపడ్డ చిత్రాలు. చారిత్రాత్మక చిత్రాలు పూర్తిగా స్టేజి డ్రామాలపై ఆధారపడి తీసిన చిత్రాలే.

ఆస్కార్ బహుమతులు పొందిన స్ట్రీట్‌కార్ నేమ్డ్ డిజైర్ (street car named desire) బ్రాడ్వే ఫ్రాలీస్ నాటక రూపంలో సృష్టించుచున్నారు. చాలావరకు రచయితలందరూ ఒకేరకపు సమస్యలను చేపట్టి ఒకేరకపు పాత్రలను సృష్టించుచున్నారు. ఆంధ్రప్రజా జీవితం సర్వతో ముఖంగా ప్రతిబింబించటంలేదు. ఆంధ్ర ప్రేక్షకులు అనేక కారెక్టర్ల (Multi character) చిత్రాలను బాగా ఆనందించుతారు. ఆంధ్ర రచయితలు, స్టేజికి ఈనాడు ఉన్న హద్దులను పట్టి పాత్రల సంఖ్యను తగ్గించివేసి ఒకేరకపు సమస్యలను తీసుకోవటంవలన, ఒకేమాదిరి పాత్రలను సృష్టించుచున్నందువలన నిర్మాతలు ఆంధ్రస్టేజిని ఏ విధంగాను వాడుకోలేమని భావించుతున్నారు. కాని వారితోటి హాలివుడ్, జపాను, రష్యా నిర్మాతలు స్టేజిని చలనచిత్ర పరిశ్రమకు ఒక భాగంగా చేసుకుని చిత్రనిర్మాణంలో క్రొత్త మార్గం అనుసరించగలిగినప్పుడు మన నిర్మాతలు కూడా స్టేజిని ప్రోత్సహించి ఆ విధంగా ఎందువలన ప్రయత్నం చేయరో అర్థంకావటంలేదు.

### *ప్రేక్షకుల సౌకర్యాలు*

చాలా ప్రదర్శనశాలలలో ప్రేక్షకులకు సరియైన సౌకర్యాలు ఉండటంలేదంటే అతిశయోక్తికాదు.

హెల్తు ఆఫీసరును కూడగట్టుకుని మరుగుదొడ్లు కూడా పరిశుభ్రంగా ఉంచని ప్రదర్శకులు చాలామంది వున్నారు. ఏ కొద్ది ప్రదర్శనశాలలో తప్ప మిగతావానిలో ప్రేక్షకులను మందను తోలినట్లు తక్కువ క్లాసులలో క్రుక్కటం, సౌకర్యంగాలేదంటే. అధికారులకు పోలీసులకు రిపోర్టుచేసి గల్లంతు చేస్తున్నారని లాఠీచార్జీ చేయించటం తెలుగుచిత్రం విడుదలైన మొదటి రోజులలో చూసే సామాన్య విషయం. ప్రభుత్వం ముఖ్యస్థానమైన ఆంధ్ర రాజధాని కర్నూలులో పైన బాల్కనీలో గవర్నరు, మంత్రులు కూర్చుంటే క్రింద 0-4-0 క్లాసులో ప్రేక్షకులను బెంచీలు కూడా తీసివేసి ఉమ్ములు, పొగాకు మరకల మధ్య నేలమీద కూర్చోమంటూ క్రుక్కుతూంటే మన పరిశ్రమ ప్రజల దృష్టిలో ఎంత అగౌరవంగా అగుపడుతుందో చూడవచ్చు. సినిమాటోగ్రాపు చట్టం ప్రకారం కెపాసిటీ అనుసరించి కాకపోయినా ప్రేక్షకుల ప్రాధమిక సౌకర్యాలుకూడా యీ రోజులలో ఇవ్వలేక పోవటం చింతించాల్సిన విషయం. కనుక ప్రేక్షకుల అసౌకర్యం కలిగేలాగ చేయటం మానాలి. హాలులో ప్రేక్షకుల మధ్య తిరుగుతూ అమ్మటం మానాలి. పొగత్రాగుట తీవ్రంగా నిషేధించాలి. పరిశ్రమలోని పనివారల పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతూంది .వారికి ఏ విధమైన సెక్యూరిటీ లేదు. మానివేసినప్పుడు లేక ఉద్యోగం పోయినప్పుడు ప్రావిడెంటుఫండు ఏర్పాట్లుకాని గ్రాట్యుయిటీ ఏర్పాట్లుగాని లేవు. మానేజరుగా వున్న వ్యక్తికూడా ఉద్యోగం మానితే ఎందుకూ పనికిరాకుండా పోతున్నాడు.

ఈ పరిశ్రమలో చెప్పుకోదగ్గ విషయం. ఒకసారి యీ పరిశ్రమలో పనిచేసిన వ్యక్తి యింకొక పని చేయలేకపోవటం. జీవితం వినోదం మేళవించిపోయిన యీ పరిశ్రమలో పనివారల జీవితాన్ని గురించి వ్యాపారస్తులు శ్రద్ధ వహించకపోతే వారికే నష్టం.

భవిష్యత్తుని గురించి సరియైన దృక్పథం లేనందున యీనాడు పరిశ్రమలోని పనివారలలో నిరుత్సాహం గమనించవచ్చును. కనుక సినీ ఎంప్లాయిస్ సమర్పించిన మెమోరండం పరిశీలించి ఒక నిర్ణయాన్ని చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ సమస్యలను ఆంధ్ర ఛాంబరు పరిశీలించి ఒక కార్యక్రమం మొదలిడటం చాలా మంచిది.

నిర్మాతలు ఎదుర్కొంటున్న ఆర్థిక, సాంకేతిక సమస్యలు ఈ వ్యాసంలో చర్చించబడలేదు కాని ఎక్కువ నిడివికల చిత్రాల రెండవ ఆట కలెక్షన్లు చాలా తగ్గుతున్నాయి కనుక భాషా రాష్ట్రాల మార్కెట్టు దృష్ట్యా 13వేల అడుగులకు మించి చిత్రాల నిడివి వుండటం పరిశ్రమకు శ్రేయోదాయకం కాదని చేంబరు వివరించటం ఎంతైనా అవసరం.

చిత్రాల విడుదలలో ఈనాడు చాలా అరాచకం అగుపడుతోంది. సంవత్సరానికి 30 చిత్రాలను మించి విడుదల చేయని మన పరిశ్రమ, ఒక క్రమ పద్ధతిలో విడుదల చేస్తే కొంత అవసరమైన పోటీ తగ్గించవచ్చును. నిర్మాతలు డిస్ట్రిబూటర్లు ఈ విషయంలో పరస్పర సహకారంతో చిత్రాలను విడుదల చేయటం చాలా అవసరం.

చేంబరు స్థాపించి రెండు సంవత్సరాలయ్యింది. ప్రభుత్వంతో కొన్ని వ్యక్తిగత సమస్యలపైన కృషిచేసి, రాయబారాలు జరిపి ప్రదర్శకులు లైసెన్సులు తొందరగా తెచ్చుకోవటానికి వీలైన కొన్ని ప్రభుత్వ ప్రకటనలు, ఆర్డర్లు సాధించగలిగారు.

వ్యక్తిగతంగా వుండే సమస్యలపై కృషి చేసేదానికంటే సమస్యలను చట్టంలోని వివిధ లోట్లను మెమొరాండం రూపంలో తయారుచేసి సినిమాటోగ్రాపు రూల్సులోని లోట్లను చూపి మన అవసరాలను కచ్చితంగా వివరించాలి.

ఆంధ్ర అసెంబ్లీకి ఎన్నికైన వారిలో తొమ్మిదిమంది ప్రదర్శకులు కూడా ఎన్నుకోబడ్డారు. కనుక వారు ప్రదర్శకుల కష్టనిష్టూరాలు గమనించి రూల్సులోని లోపాలను సవరించి, ఒకే లైసెన్సు పద్ధతి అమలులోకి తేవటానికి, బహిరంగ సినిమాలకు లైసెన్సులు యివ్వటంలోను, కృషిచేస్తే పరిశ్రమకు ఎంతో సహాయం జరుగుతుంది.

Post your comments